
కథ

# వారసులు[డు]

ఘండికోట బ్రహ్మాజీరావు



గోదావరి పాతరైలు బ్రిడ్జికి సమీపంగా ఉన్న రేవులో పొద్దుట ఎనిమిది గంటలనుండి చాల రద్దీగా ఉంది. ఫిబ్రవరి మొదటివారం- చల్లటిగాలి తూర్పునుంచి వీస్తున్నది. నునులేత ఎండ వెనుకనుంచి వస్తున్నది. ఆ రేవులో కర్మలు చేస్తారు. కర్మ చివరిరోజులు జరపడానికి అక్కడికి వస్తారు.

రంగయ్య ప్రతిరోజా ఉదయం ఎనిమిదిగంటలకి రేవులో పై పావంచీలమీద కొబ్బరికాయలు, అరటిపళ్లు మొదలైన సామాన్లు పూజకోసం అమ్మే నారాయణమ్మ దుకాణానికి వస్తాడు. రెండు అరటిపళ్లుకొని గోదావరికి సమర్పిస్తాడు.

"నారాయణమ్మా! ఈ సోమన్న వంతులు గొడుగుకింద అంతమంది ఉన్నారేమిటి?" రంగయ్య ఆమెను అడిగాడు.

ప్రతి తీర్థ పురోహితుడు పెద్ద సిమెంటు గొడుగులకింద కర్మలు జరిపిస్తాడు.

"రావూపురం జమీందారిణిగారి పన్నెండవరోజు కర్మకి ఇంతమంది జనం వచ్చారు." అంది ఆమె.

"తలలు గీయించుకున్న వాళ్లందరూ...?"

"అవునవును తాము జమీందారిణిగారి వారసులమని వాళ్లంటున్నారు."

"ఆమె పేరేం పేరు?"

"కొంతమంది వారసులనడిగితే మాణిక్యంబగారని అంటున్నారు. కొంతమంది శారదాంబగారంటున్నారు. కొంతమంది జ్ఞాన ప్రసూనాంబగారంటున్నారు.

"చాలా బాగుంది. ఆవిడకు సంతానం లేదా?"

"ఉంటే ఈ కర్మ దేనికి?"

"ఎండ కొంచెం వెచ్చనయింది.

రేవుకి కుడిచేతి వేపు పాండురంగస్వామి మందిరం ఉంది. అక్కడో సాధువు కూర్చొని సంస్కృత శ్లోకాలు చదువుతున్నాడు.

నలుగురు బ్రాహ్మణులు యజ్ఞోపవీతాలు వడుకుతున్నారు. ఒకడు మరొకడిని అడిగాడు:

"నువ్వు అయిదుగురు వారసులకు యజ్ఞోపవీతాలు ఇచ్చావు కదా, డబ్బేమన్నా ఇచ్చారా?"

"వాటన్నిటికి సోమన్న పంతులే ఇస్తాడని వాళ్లన్నారు."

సిగిరెట్టు బలంగా పీల్చి ఆ బ్రాహ్మడు వురెక్కిస్తున్న దారంమీద దృష్టి నిలిపాడు.

జమీందారిణిగారి అన్ని రోజులకర్మ పన్నెండో రోజునే జరుపుతున్నారు.

తీర్థ పురోహితుడు సోమన్న పంతులు అన్ని ఖర్చులు తనే భరిస్తున్నాడు. ఆ వారసుల దగ్గర డబ్బులేదు. కర్మ సవ్యంచేస్తే, కోర్టులో జమచేసిన పాతికవేల రూపాయలు అందుతాయి. ఆ డబ్బులో సగం భాగం సోమన్న పంతులుకి. దానాలు, ధర్మాలు చాలా గొప్పగా జరపమంటూ వారసులు అంటున్నారు. అందులో సోమన్న పంతులుకి బాగా కిట్టుబాటు అవుతుంది.

క్రమంగా ఎండ హెచ్చుతున్నది. పాండురంగ మందిరంపైనున్న రావిచెట్టు ఆకులు రెపరెపలాడుతున్నాయి.

పదిమంది సాధువులు సంభావనల కోసం కొద్దిదూరంలో వేచి యున్నారు. అందరూ సావకాశంగా పావంచీలమీద కూర్చున్నారు. వాళ్లను పిలిచేసరికి మరికొంతవేళ అవుతుంది.

సోమన్నకు మామూలు కర్మకు దొరికే దానికన్న మూడురెట్లు డబ్బు హెచ్చుగా లభిస్తుంది. అతడు చాల ఉత్సాహంతో పనులు చేస్తున్నాడు.

దగ్గిరలో కూర్చున్న ఒక వయసు మళ్లిన అతను ఉన్నాడు. అతడు పెద్దగొంతుతో చెప్తున్నాడు.

"పరమేశ్వరి దయవల్ల నేను నీటిపై నడవగలను. గాలిలో ఎగరగలను. ఇవన్నీ శాంభవీ విద్యలు. వీటి సహాయంతో అప్పుడప్పుడు స్వర్గానికిపోయి అప్సరసల నాట్యం చూసి వస్తుంటాను- భూలోకంలో బోర్ కొడుతుంది. ఒరే శిష్యా! సోదర సాధువులతో ఈ సంగతి నిజమని చెప్పరా!"

ఆ సాధువు తల ఆడించాడు. పక్కనున్న సాధువుతో మెల్లిగా అన్నాడు.

"ఈ కాళీకింకర సాధువు, చిలుంపట్టు కొంచెం హెచ్చయితే, ఇలాంటి కబుర్లే చెప్తాడు. రాత్రి, సత్రవు అరుగులనుండి కిందకు దిగడానికి నన్ను సాయం రమ్మంటాడు."

మరో సాధువు కాళీ కింకర్ని అడిగాడు.

"ఇంతెందుకు, కర్మలు చేసే ఈ రేవుకి చీకటి పడిన తరువాత మీరు రాగలరా?"

"ఈ ప్రేతాత్మలు, కోరికలు తీరని కామినీ పిశాచాలు, రోజూ కలుస్తూనే ఉంటాయి. నీటిమీద నడుస్తూ ఉంటే అని నా వెంట వస్తూ ఉంటాయి."

మరో సాధువు అడిగాడు.

"గురూజీ! మీకు స్వర్ణయోగం తెలుసు కదా! మరెందుకీ దానాల కోసం చెయ్యి చాచడం?"

"అదంతా ఇతరుల కోసం. బారువులకొద్దీ బంగారం తయారుచేసే సామర్థ్యం నాకుంది."

రమారమి పదిగంటలు కావస్తున్నది.

హడావుడిగా వయసులోవున్న సాధువొకడు మెట్లు దిగి వచ్చాడు. వస్తూనే నారాయణమ్మను అడిగాడు.

"ఇక్కడ ఎవరికర్మ జరుగుతున్నది?"

"రావూపురం జమీందారిణిగారిది."

"వీళ్లందరూ ఎవరు?"

"కర్మ చేయడానికి వచ్చిన వారసులు."

"అయితే ఏ లోటు లేకుండా కర్మ జరుగుతున్నట్లే!"

"అలాగే అనుకోవాలి."

వచ్చిన కొత్తసాధువుకు పాతికేళ్లకన్నా హెచ్చు వుండవు. చిన్న గడ్డముంది. మనిషి పొడవుగా ఉన్నాడు. గూడకట్టు కట్టుకున్నాడు. కాలరులేని పొడవుచేతుల చొక్కా తొడుక్కున్నాడు. భుజానికి సంచీ వేలాడుతున్నది. పైన అంగవస్త్రం కప్పుకున్నాడు. దానిమీద నాగలిపిలో హరేరామ హరేకృష్ణ మంత్రం ముద్రించి ఉంది. అతని బట్టలన్నీ కాషాయవస్త్రాలే. మనిషి వర్చస్విగా కనిపిస్తాడు. అతని చూపులు హృదయంలోకి చొచ్చుకుంటాయి.

కాళీ కింకర్ సాధువు వచ్చిన మనిషిని దగ్గిరగా పిలిచి అన్నాడు.

## మూడేళ్లు పట్టింది!

నటి శ్వేతామీనన్ తొలి చిత్రం 'బంధన్.' మూడేళ్ల తరువాత ఇప్పుడు శ్వేత 'ప్రాణ్ జాయే పర్ శాన్ న జాయే'లో చేస్తున్నది. 'బంధన్'లో సల్మాన్ ఖాన్, జాకీష్రాఫ్ హీరోలు. ఇప్పుడు 'ప్రాణ్ జాయే...'లో కనిపించబోతూంది. ఎందుకింత గాప్ వచ్చిందని అడిగితే, "నాకు అవకాశం వచ్చిన ప్రతి చిత్రంలోనూ చేయదలచలేదు. చక్కని పాత్ర ఏదీ ఎవరూ ఇవ్వలేదు. అందుకే కాస్త ఓపికతో ఎదురుచూశాను, ఫలించింది. ఇప్పుడు 'ప్రాణ్ జాయే...' కాకుండా, 'మియా మక్బూల్'లో నసీరుద్దీన్ షాతబ్బూలతో, 'మార్కెట్'లో మనీషాకోయిరాలాతో, 'కోయీ హై'లో అమన్ వర్మ సరసనా, 'ఫ్రెష్ లైమ్'లో చుంకీపాండేతోనూ చేస్తున్నాను. మొత్తం ఐదు చక్కని చిత్రాలు" అంటూంది శ్వేత.



"ఎక్కడనుంచి వస్తున్నావు?"

"హరిద్వారం నుంచి" అన్నాడు కొత్తసాధువు.

"నీ బంధువులెవరికేనా కర్మ జరుగుతున్నదా?"

"అన్నిటినీ విడిచి సాధువులతో తిరిగేవాడికి చుట్టాలెవరు, పక్కాలెవరు?"

"చాల బాగుంది. మేము పదిమందిమి. పాండురంగస్వామి మందిరం దగ్గిర ఉన్న సాధువు పదకొండోవాడు. మా పదకొండుగురికి సంభావనలిస్తానని సోమన్న పంతులు అన్నాడు. నీకు కూడా ఇమ్మని చెప్తాను. మాతో ఉండు."

కొత్త సాధువేమీ మాట్లాడలేదు.

సోమన్న పంతులు పెద్ద గొంతుతో మంత్రాలు చదువుతున్నాడు.

ఇంతలో ఒక ఆవుని, ఒక ఎండిపోయిన దూడని తెచ్చారు.

"ఇదేమిటయ్యా, పంతులూ! ఆవువట్టి పోయిందే?" అన్నాడు ఒక వారసుడి బంధువు.

"వట్టిపోయిన ఆవు ధర రెండువందల రూపాయలు. పాలిచ్చే ఆవుధర అయిదు వందలు. ఏది కావాలో చెప్పండి" సోమన్న పంతులు అన్నాడు.

"ఏదో కానివ్వండి" అన్నాడా బంధువు.

ఇంతలో ఓ వయసులో ఉన్న ఆడమనిషి మెట్లు దిగి వచ్చింది. ఆమె నారాయణమ్మను ఏదో అడిగింది. నారాయణమ్మ నదివేపు చూసింది. అయిదారు పడవలు అక్కడ ఉండేవి. మనుషులు వస్తూంటే వాళ్లను ఎక్కించుకొని కొవ్వూరువేపు అన్నీ వెళ్లిపోయాయి.

ఆయన చేతిలో కూరల సంచీ వుంది. పొడుగుగా మునగకాడలు పైకి కనిపిస్తున్నాయి. ఆమె వెళ్లి కొత్తసాధువుకు దగ్గిరగా కూర్చుంది. అటు ఇటు చూసి ఆమె అతనిని అడిగింది.

"ఎక్కడనుంచి వచ్చావు సాధూ? నిన్ను ఎప్పుడూ ఈ రేవులో చూసినట్లు లేదే!"

"అవును, నేనిక్కడివాడిని కాను. హరిద్వారం నుండి వస్తున్నాను" అన్నాడు అతడు.

"కర్మ చేస్తున్నవాళ్లు నీకు తెలుసా?"

"వాళ్లెవరో నాకు తెలియదు. కాని చనిపోయిన జమీందారిణిగారు మా వూరివాళ్లే."

"ఏమిటేమిటి? ఆ జమీందారిణిగారి గురించి నీకు తెలుసా?"

"తెలుసు, చాలా బాగా తెలుసు. ఆమె చనిపోయిన సంగతి విని కర్మ ఆఖరునాటికి చేరుకున్నాను. కర్మ చాలా బాగా జరుగుచున్నది. సోమన్న పంతులుగారు చాలా శ్రద్ధతో చేస్తున్నారు."

"అవునవును."

ఆమె నది వంక చూస్తున్నది. చిన్న సాధువు ఆమెను అడిగాడు.

"మీ ఇల్లెక్కడ?"

"కొవ్వూరులో పడవల రేవుకి దగ్గిరలో."

"మీ పేరు?"

"సత్యవతి."

"టీచరు పని"

"కొవ్వూరులో కాయగూరలు దొరకవా?"

"దొరక్కేం! తోవలో మునక్కాడలు కనిపించాయి."

"మునక్కాడలంటే నాకు చాల ఇష్టం."

"మరేం! ఈ కర్మ చూసుకున్న తరువాత మా ఇంటికి రా! మా అమ్మచాలా బాగా గుత్తివంకాయ కూర వండుతుంది. కుమ్ములో కాల్చి దోసకాయపచ్చడి చేస్తుంది. మునగకాడల పప్పుపులుసు మా అమ్మ చేసినట్లు ఎవరూ చెయ్యలేరు. మాకు పాడి వుంది. ఆవుపెరుగు ఎంత బాగుంటుందో!"

"ఇవన్నీ వింటూంటే నోరూరుతున్నది."

"అది సరే కాని, జమీందారిణిగారి గురించి చెప్తూ ఆపేశావు."

"ఆమె మాటపట్టింపుగల మనిషి. ఉన్న ఒక్క కొడుకు ఆమె నిశ్చయం చేసిన జమీందారుల ఇంటిపిల్లను చేసుకోకుండా సాధారణ కుటుంబంలోని పిల్లను చేసుకోడానికి నిర్ణయిస్తే, అతనిని ఇంటినుండి వెళ్లగొట్టింది."

"ఇంతకీ, జమీందారి ఆమెకెలా దఖలు పడింది?"

"ఆమె తల్లిగారి వలన."

"అందుకోసమే, తనవంతు ఆస్తికోసం అతడు కోర్టుకెక్కలేనట్లుంది."

"కాకపోయినా, అతడు చాలా పౌరుషంగల వ్యక్తి. ఉన్న ఊళ్లోనే బడిపంతులుగా ఉద్యోగంచేసి, తనకు నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు."

"ఆ అమ్మాయి చాలా అందంగా ఉండి ఉంటుంది, లేకపోతే, అన్నీ విడిచిపెట్టి, సామాన్యుల కుటుంబంలోని పిల్లను ఎందుకు పెళ్లాడుతాడు?"

"నిజమే! మా అమ్మ చాలా అందమైనది."

ఒక్కసారి సత్యవతి అదిరిపడి చిన్న సాధువువేపు జరిగింది.

"ఏమిటంటున్నావ్?"

రేవులోకి పడవొకటి వస్తున్నది.

"జమీందారిణిగారి కోడలు చాల గుణవంతురాలు. ఎన్నో మంచి విషయాలు ఆమెగురించి చెప్పుకోవాలి."

"తరువాత, తరువాత."

ఇంతలో పడవ చేరుకుంది. దానినుండి మనుషులు దిగుతున్నారు.

"పాపం! నాకోసం మీరెందుకు కూర్చోవడం! కర్మ పూర్తయ్యేదాకా నేనుండక తప్పదు."

పడవలోకి మరికొందరు ఎక్కుతున్నారు. తెరచాపలెత్తి పడవ కొవ్వూరువేపు వెళ్లిపోయింది.

"చిన్న సాధూ! నువ్వు చెప్పినదంతా విని, నిన్ను మా ఇంటికి తీసుకుపోతాను. మరి ఇన్ని ఆలోచనలు లేవు... తరువాత ఏమయిందో చెప్పు."

"పదిహేను సంవత్సరాలు కాపురంచేసి, జమీందారిణిగారి కోడలు పరమపదించింది."

"శివ, శివా!"

"ఆరునెలలు తిరగకుండా, భార్యతోడిదే లోకమనుకున్న మానాన్న పోయాడు."

"ఏమిటి?" ఆశ్చర్యంతో ఆమె చిన్న సాధువువేపు చూసింది.

"పద్నాలుగేళ్ల కొడుకు ఊరువిడిచి

**బిపాశ శరతు!**

'రుద్రాక్ష' చిత్రంలో నటించేందుకు బిపాశాబసు కొన్ని శరతులు పెట్టిందట. వాటిలో ఒకటి హీరో సంజయ్ దత్ తన వీపు మీద మాలిశ్ చేయకూడదని. దర్శకుడు ఎంతో నచ్చజెప్పిన మీదట ఒప్పుకుందట కానీ, అవసరమైనంత మేరకే వీపు భాగాన్ని తాకాలందిట. ఏమ్మా, సంజూ బాబా నీ బాయ్ ఫ్రెండ్ కాడు కాబట్టే నఖరాలు పోతున్నావా? అని చాటుగా చెవులు కొరుక్కుంటున్నారట!



పారిపోయాడు."

"ఎక్కడికి?"

"సాధువులలో కలిసిపోడానికి వెళ్లిపోయాడు."

"చాలా మంచి మలుపు తిరిగిందే కథ."

"గంగ ఒడ్డున, హృషీకేశంలో, లక్ష్మణఝూలాకు పక్కనొక ఆశ్రమం ఉంది. అందులో అతనికి ఆశ్రయం దొరికింది. తిండి, బట్ట, చదువు, వసతీ అన్నీ ఆశ్రమంలోనే లభించాయి. చదువు పూర్తికాగానే ఆశ్రమంలో ఉద్యోగమిచ్చారు. అక్కడ ఆయుర్వేద ఔషధాలు తయారుచేస్తారు."

"చాలా బాగుంది."

"నాలుగురోజులకింద, రామాపురం వాళ్లు కొంతమంది, హృషీకేశ్ వచ్చారు. వాళ్లు జమీందారిణిగారు పోయినట్లు చెప్పారు. ఆమె కర్మ సవ్యంగా జరుగుతున్నదో లేదో చూడాలని..."

ఇంతలో రెండుమెట్లు కిందకు దిగి, సోమన్న పంతులు కర్మ చేస్తున్న చోటికి ఒకడు దండోరా వేస్తూ వచ్చాడు.

"ఓహో! జనులారా! కోర్టువారి ఉత్తరువులు వినండి. రామాపురం జమీందారిణిగారికి కర్మ చేస్తున్న అయిదుగురు వినండి. మీరు కర్మచేస్తున్నట్లు కోర్టువారికి పెట్టుకున్న అర్జీ పరిశీలించడం జరిగింది. మీ అయిదుగురి పుట్టు పూర్వోత్తరాలు కోర్టువారు వాకబు చేయించారు. మీకు వారసత్వపు హక్కు లేదు. మీరు చేస్తున్న కర్మ చెల్లనేరదు. ఇది కోర్టువారి ఉత్తరువు."

అప్పుడు పెద్ద గందరగోళం జరిగింది.

కర్మ చేస్తున్నవాళ్లు, వాళ్ల బంధువులు వెర్రులెక్కిపోయారు. సోమన్న పంతులును రెండు బాదులు బాది పూజా ద్రవ్యాలన్నిటినీ కాళ్లతో తన్ని నాశనం చేశారు. ఒక్క పదినిమిషాలలో అందరూ చెట్టుకో పిట్టయి పారిపోయారు.

పదకొండుమంది సాధువులు, నలుగురు బ్రాహ్మణులు, ఇంకా దానాలకోసం వేచియున్న ఇతరులు బ్రాన్పడిపోయారు.

చిన్న సాధువు ఒక్కసారి లేచాడు. తిన్నగా సోమన్న పంతులు దగ్గరికి వెళ్లాడు. అతనితో ఏమిటి చెప్పాడో? చేతిసంచీ నుండి నూరురూపాయలనోట్ల కట్టలు అతని చేతుల్లో పోశాడు.

"సోమన్న పంతులుగారు! కర్మ తిరిగి ప్రారంభించండి. అనుకున్న దానికన్నా హెచ్చుగా దానాలకింద ఇవ్వండి. పాడి ఆవుని, పాలు తాగుతున్న దూడని దానానికి తీసుకురండి. నేనిస్తున్న పాతికవేలతోను, ఏ లోటు లేకుండా, జమీందారిణిగారి కర్మ జరిపించండి" అన్నాడు చిన్న సాధువు.

సోమన్న పంతులుగారికి వేయి ఏనుగుల బలం వచ్చింది.

"బాబూ! ఈ గడ్డంతోను, కాషాయ వస్త్రాలతోను కర్మ చేయడానికి వీలులేదు. వీడికింకా ఉపనయమయిందా?"

"అయింది, కాని యజ్ఞోపవీతంలేదు."

"ఓయ్ కామన్నా! బాబుగారికి మంచి యజ్ఞోపవీతం ఇయ్యి."



చిన్న సాధువు కాషాయవస్త్రాలు ఒకపక్కన విడిచి పెట్టాడు. కొత్త పంచ కట్టుకున్నాడు. తువాలు భుజంమీద వేసుకున్నాడు. గడ్డాలు, మీసాలు, తలపైన జుత్తు తీయించుకుని గోదావరిలో స్నానంచేసి కర్మ చేయవలసిన గొడుగుకిందికి వచ్చాడు.

సత్యవతి ఆశ్చర్యంతో అన్నీ చూస్తూ నిలబడిపోయింది.

అన్ని పనులు సజావుగా జరిగిపోయాయి.

దానాలు, ధర్మాలు అన్నీ పుష్కలంగా-

ఒక ఇరవైమందికి, వారసులకు వాళ్ల బంధువులకు, తీర్థ పురోహితుడు భోజనాలు ఏర్పాటు చేశాడు. ఇప్పుడు, వాళ్ల జాగాలో సాధువులకు, నలుగురు బ్రాహ్మణులకు భోజనాలు పెట్టించాడు. తనకు ప్రసాదం చాలునని, వేరేచోట భోజనం చేస్తానని చిన్న సాధువు చెప్పాడు.

చిన్న సాధువు మెట్లు దిగి, ఖాళీగా వున్న పడవలోకి ఎక్కాడు. అతని వెంటే సత్యవతి వెళ్లింది.

"ఇదంతా కలలో జరిగినట్లుంది" అంది సత్యవతి.

"ఇక చేయవలసినది, మీ ఇంట భోజనం" అన్నాడు చిన్న సాధువు.

సత్యవతి చివరి పావంచీ వరకు వచ్చింది, నదిలో దిగబోతుంటే, పై పావంచానుండి సోమన్న పంతులు గట్టిగా పిలుస్తున్నాడు.

అతని చేతిలో ఆకు పొట్లాం ఉంది, మరో చేతిలో కాగితం ఒకటుంది.

సత్యవతి వెళ్లి అది తీసుకువచ్చింది.

పడవ కదలడానికి సిద్ధంగా వుంది.

చేతిలోని ప్రసాదం పొట్లాం చిన్న సాధువుకి ఇచ్చింది. పడవ బైటనే, నీటిలో నిలబడి, చేతిలో ఉన్న ఉత్తరం గట్టిగా చిన్న సాధువుకు వినిపించేటట్లు చదివింది.

"తీర్థ పురోహితులైన సోమన్నపంతులు, ఫలాన తేదీన వ్రాసి ఇచ్చిన సర్టిఫికెట్. లేటు భవానీ శంకరంగారి భార్య, రామాపురం జమీందారిణిగారైన శ్రీమతి పార్వతమ్మ గారి పన్నెండవ రోజు కర్మ, ఆమె కుమారుడు లేటు వరప్రసాదరావుగారి ఏకైక పుత్రుడు, చిరంజీవి భవానీ శంకరం, జమీందారిణిగారి హోదాకు తగినట్లు జరిపించాడు. ఈ కింద సంతకాలు చేసిన సాక్షుల సమక్షంలో, నా చేతుల మీదుగా ఈ కార్యం జరిగింది. ఇట్లు, సోమన్న పంతులు- తీర్థ పురోహితులు."

ఆ ఉత్తరం సత్యవతి మరోసారి చదివింది. ఒకసారి ముద్దు పెట్టుకుంది. జాగ్రత్తగా మడిచి, చిన్న పర్సులో పెట్టి, జాకెట్టులో పెట్టుకుంది.

భీమశంకరం, పడవలోకి ఎక్కుతున్న సత్యవతికి చేయి అందించాడు.

### కూతురి సంతోషం!

కుటుంబాల్లో ఏర్పడిన మనస్పర్థలతో కూడా మేలే జరుగుతుందని నిరూపించింది కపూర్ల కుటుంబం. కూతుళ్లు కరిష్మ, కరీనలతో సహా తల్లి బబిత, మళ్లీ భర్త రణధీర్ కపూర్‌కు దగ్గరైందట. ఆ నలుగురూ కలిసి ముంబయిలోని ఓ రెస్టారెంట్‌లో ఫామిలీ డిన్నర్ తీసుకుంటూ జనానికి కనిపించారట. ఢిల్లీలో రణధీర్‌కు హార్ట్ సర్జరీ జరిగినప్పుడు కూడా ముగ్గురాడవాళ్లూ పక్కనే వుండి అన్నీ చూసుకున్నారు. లోలో (కరిష్మ ముద్దు పేరు) తల్లిదండ్రులు తిరిగి ఒకటైన సందర్భంలో, తన మనసులో వారిద్దరి పట్లా ఎంత అనురాగం వుందో తెలియజేయటానికి, ఇద్దరికీ కలిపి ఓ లగ్జరీ కారును బహూకరించింది.